# డాక్టర్ జి.ఎస్. రాజు

డాక్టర్ జి.ఎస్. రాజు 1958 వ సంవత్సరం జూలై 8 వ తేదీన శాసన పరిషత్తు తొలి ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై 1964 వ సంవత్సరం జూన్ 30 వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు.

వీరు కృష్ణా జిల్లాలోని ఒక కుగ్రామంలో స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబంలో శ్రీ రామరాజు శ్రీమతి బంగారమ్మ దంపతులకు జన్మించారు.

డాక్టర్ జి.ఎస్. రాజు బెనారస్ హిందూ యూనివర్సిటీలో సైన్స్ డిగ్రీ పూర్తి చేసిన తరువాత యు.ఎస్.ఎ. లోని శాన్ ఫ్రాన్సిస్కోలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా మెడికల్ సెంటర్ నుండి ఎం.ఎస్. పట్టాను పొందారు. ఆ పై వీరు ఆల్టర్నేటివ్ మెడిసిన్‌లో ఎమ్.డి. డిగ్రీని, ప్రపంచ శాంతికి యోగము మరియు ధ్యానము అనే విషయముపై పరిశోధన చేసి పి.హెచ్.డి. ని పొందారు.

వీరు 1958 వ సంవత్సరం జూలై 1 వ తేదీ నుండి 1964 వ సంవత్సరం జూన్ 30 వ తేదీ వరకు శాసన పరిషత్తుకు నామినేటెడ్ సభ్యులుగా ఉన్నారు.

వీరు 1958-59, 1959-60, 1960-61, 1961-62, 1962-63, 1963-64 సంవత్సరాల మధ్యకాలంలో అర్జీల మరియు విశేషాధికారాల సమితి అధ్యక్షులుగా, సభా సంఘం అధ్యక్షులుగా కూడా పనిచేసారు.

డాక్టర్ జి.ఎస్. రాజు 1981-82 సంవత్సరాలలో అమరావతీసీమ పట్టణాభివృద్ధి సంస్థ, విజయవాడ ఛైర్మన్‌గా పనిచేసారు. డాక్టర్ రాజు 1976-77 సంవత్సరాలలో ఆల్ ఇండియా మాన్యుఫ్యాక్చరర్స్ ఆర్గనైజేషన్, ఎ.పి. స్టేట్ బోర్డుకు, 1978-79 లో ఇండియన్ డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్, ఎ.పి. స్టేట్ బోర్డుకు మరియు ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్, ఎ.పి. బ్రాంచ్‌కు అధ్యక్షులుగా పనిచేసారు. ఇవే కాకుండా 1965-66 లో విజయవాడ కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్‌కు అధ్యక్షులుగాను, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సదరన్ జోన్ అడ్వయిజరీ బోర్డులో సభ్యులుగా పనిచేసారు. రీజినల్ రీసెర్చ్ లేబొరేటరి, హైదరాబాద్‌లోని రీసెర్చ్ అడ్వయిజరీ కౌన్సిల్‌లో సభ్యులుగా కూడా పనిచేసారు.

డాక్టర్ రాజు ఫార్మసీ రంగంలో చేసిన కృషికి గాను "ఫెలో ఆఫ్ ది అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ఫార్మస్యూటికల్ ఎడ్యుకేషన్" అవార్డును, దేశాభివృద్ధిలో ఒక పారిశ్రామికవేత్తగా ఆయన చేసిన కృషికి గుర్తింపుగా 1989 లో "ఉద్యోగ రత్న" అవార్డును, 1980 లో ఆల్ ఇండియా మాన్యుఫ్యాక్చరర్స్ ఆర్గనైజేషన్ నుండి "మెంబర్ ఆఫ్ ది ఇయర్" అవార్డును పొందారు.

ప్రముఖ పారిశ్రామిక వేత్త అయిన వీరు ఔషధాలను తయారు చేసే కర్మాగారంతో పాటు అనేక సంస్థలను ఏర్పాటు చేసి ఆ సంస్థలకు "సిరీస్" అనే పేరు పెట్టారు.

డాక్టర్ రాజు దేశంలో పారిశ్రామికాభివృద్ధికోసం పలుమార్లు ప్రపంచమంతటా విస్తృతంగా పర్యటించారు.

ప్రస్తుతం డాక్టర్ జి.ఎస్. రాజు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి, ఎ.పి. స్టేట్ బ్రాంచ్, హైదరాబాదుకు ఉపాధ్యక్షులుగా, గుంటూరులో వున్న సెంట్రల్ ఎక్సైజ్ రీజినల్ ఎడ్వయిజరీ కమిటీలో సభ్యులుగా, నాగార్జున యూనివర్సిటీ సెనేట్ సభ్యులుగా పనిచేస్తున్నారు.